నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 188 రంగారెడ్డి | మంగళవారం 10 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 10-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

ప్రైవేట్ పాఠశాలలకు
విద్యాశాఖ హెచ్చరిక..
'ప్రశస్త్' స్క్రీనింగ్‌పై కీలక ఆదేశాలు

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :



రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పాఠశాల విద్య డైరెక్టర్, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమవారం అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. 3 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన దివ్యాంగ పిల్లలను ముందస్తుగా గుర్తించేందుకు ఉద్దేశించిన 'ప్రశస్త్' అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ ప్రక్రియను ప్రాధాన్యత ప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా భారత ప్రభుత్వం ఈ 'ప్రశస్త్' స్క్రీనింగ్ సాధనాన్ని రూపొందించిందని డైరెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ యాజమాన్యాలు అత్యంత బాధ్యతాయుతంగా చేపట్టి, క్రింది అంశాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. (మిగతా 3లో..)

రాష్ట్రం బియ్యం ధరలపై సీర్కార్ సీరియస్...
గరిష్ట పరిమితి విధిస్తూ నిర్ణయం

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

తెలంగాణలో గత కొన్ని రోజులుగా పెరుగుతున్న బియ్యం ధరలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. బియ్యం కొరత ఉందంటూ సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని పౌరసరఫరాల శాఖ ఖండించింది. రాష్ట్రంలో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని, కొరత అంటూ వస్తున్న వార్తలన్నీ తప్పుడు ప్రచారమేనని స్పష్టం చేసింది. కృత్రిమ కొరతను సృష్టించి, అధిక ధరలకు బియ్యాన్ని విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్న వ్యాపారులకు కరకట్టేందుకు పౌరసరఫరాల శాఖ బియ్యం రకాలను బట్టి గరిష్ట విక్రయ ధరలను నిర్ణయిస్తూ కీలక ప్రకటన విడుదల చేసింది. BPT, KNM రకాలకు కిలో గరిష్ట ధర రూ.66, RNR, తెలంగాణ





సోనా రకాలు కిలో గరిష్ట ధర రూ.74, HMT, JSR రకాలు కిలో గరిష్ట ధర రూ.79గా నిర్ణయించింది. అయితే, ప్రభుత్వం నిర్ణయించిన ఈ గరిష్ట ధరల కంటే ఎక్కువ మొత్తానికి బియ్యం విక్రయిస్తే సహించేది లేదని,క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వీ శ్యామ్ ప్రసాద్ లాల్ తీవ్రంగా హెచ్చరించింది.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. ప్రజలకు కీలక విజ్ఞప్తి

ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎవరైనా గరిష్ట పరిమితికి మించి అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే, అటువంటి వ్యాపారులపై క్రిమినల్ కేసులు (మిగతా 3లో..)

ఇక జిల్లాల్లోనే మెరుగైన వైద్యం..
1,616 మంది స్పెషలిస్ట్‌ల నియామకం: మంత్రి దామోదర

నిర్భయవార్త ప్రతినిధి హైదరాబాద్ :



సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా.. సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థ బలోపేతానికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక జిల్లాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, టెక్నీషియన్ల నియామకాలు కూడా చేపట్టినట్లు తెలిపారు. 30, 50, 100 పడకల ఆసుపత్రులకు వేర్వేరు వైద్య సేవల ప్రణాళికను రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రతి ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, డయాగ్నస్టిక్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఐపీహెచ్ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. చిన్న చిన్న వైద్య సమస్యలకూ హైదరాబాద్‌కు వెళ్లే పరిస్థితి తగ్గించడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

తెలంగాణలో జనగణన- 2027 తేదీలు ఖరారు..
జనవరి 25 నుంచి ఇంటింటి సర్వే

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

రాష్ట్రంలో జనగణన – 2027కు తెలంగాణ ప్రభుత్వం తేదీలు ఖరారు చేసింది. అందుకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెం.155ను సోమవారం ప్రభుత్వం జారీ చేసింది. జనవరి 25వ తేదీ నుంచి ఇంటింటి జనాభా లెక్కల సేకరణ చేపడతారు. ఫిబ్రవరి 28 వరకు ఈ జనగణన ప్రక్రియ కొనసాగుతోంది. అయితే జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు స్వీయ జనగణనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.ప్రజలే స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ వెసులుబాటు కల్పించింది. ఇక మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ చేపట్టనుంది. 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు ప్రామాణిక తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తెలంగాణ గెజిట్‌లో ప్రభుత్వం పున: ప్రచురించింది.

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు..
రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష!



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను బేఖాతరు చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా హైకోర్టు నిర్ధారించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు కలెక్టర్‌కు 6 నెలల పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును 4 వారాల పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. (మిగతా 3లో..)

యూపీ ఎన్నికలు.. 209 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు



నూఢిల్లీ :

వచ్చే ఏడాది యూపీ ఎన్నికలకు అధికార బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దీపావళి ముగిసిన వెంటనే కార్యరంగంలోకి దిగింది. ఇప్పటికే 209 స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారైనట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తుది అనుమతుల కోసం ఈ జాబితాను కేంద్ర నాయకత్వానికి పంపించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 300 పైచిలుకు స్థానాల్లో విజయం సాధించి మూడోసారి అధికార పగ్గాలు చేపట్టే లక్ష్యంగా బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. దీపావళి ముగిసిన మరుసటి రోజే రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించింది. మొత్తం 403 స్థానాలకు గాను 209 స్థానాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసినట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో అభ్యర్థులకు ప్రచారానికి, ప్రజలతో మమేకం అయ్యేందుకు తగినంత సమయం ఉండాలనే లక్ష్యంతో ముందుగా అభ్యర్థుల జాబితాను రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేసినట్టు సమాచారం. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తొలి దశలో అభ్యర్థులుగా ఖరారైన వారిని ఏ కేటగిరీగా పార్టీ పరిగణిస్తోందని సమాచారం. సీఎం యోగితో సమాలోచనల అనంతరం వీరి పేర్లు ఖరారయ్యాయి. కేంద్ర నాయకత్వం నుంచి తుది అనుమతులు రాగానే అభ్యర్థులకు ఎన్నికల ఏర్పాట్లు చేసుకునేందుకు రాష్ట్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ఈసారి ఎన్నికల్లో పార్టీ నాయకత్వం రాష్ట్రంలోని మహిళా ఓటర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ తెస్తున్నామని సీఎం యోగి ఆదివారం నాడు ప్రకటించిన విషయం తెలిసిందే.

శ్రీవారి భక్తులకు టీటీడీ తీపికబురు
2027 క్యాలెండర్లు, డైరీల ఆన్‌లైన్ బుకింగ్ షురూ



నిర్భయవార్త ప్రతినిధి :తిరుమల :

ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం తీపికబురు అందించింది. 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీల ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను దేవస్థానం అధికారికంగా ప్రారంభించింది. ఏటా భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఈ సదుపాయం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. అయితే, ఈ సారి భక్తులు క్యాలెండర్లు, డైరీల కోసం (మిగతా 3లో..)

దీపావళి పటాకుల మోత..
కాలుష్య కోరల్లో భాగ్యనగరం..
గ్యాస్ చాంబర్ లా ఢిల్లీ!



నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

ఐటీ హబ్‌గా, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ ఇప్పుడు కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. ఒకప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణానికి పేరుగాంచిన భాగ్యనగరంలో ప్రస్తుతం స్వచ్ఛమైన గాలి కరువవుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం నగరవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా హైదరాబాద్ నగరంపై దీపావళి పండుగ ప్రభావం పడింది. పలుచోట్ల పెద్దఎత్తున పటాకులు కాల్చడంతో నగరంలో గాలి నాణ్యత భారీగా క్షీణించి కాలుష్యం ఒక్కసారిగా పెరిగింది. గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లో ఏక్యూఐలో 160 పాయింట్లకు గాలి నాణ్యత పడిపోయి కాలుష్యం 410 పాయింట్లకు చేరినట్లు సమాచారం. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ ఏకంగా 600 పాయింట్లను దాటడం కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది. (మిగతా 3లో..)

నిర్భయవార్త

సంపాదకీయం


మంగళవారం 10 నవంబర్ 2026

ప్రమాదకరం..

సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డుతోపాటు బయోమెట్రిక్ ధ్రువీకరణను తప్పనిసరి చేస్తామని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడం గోరుచుట్టుపై రోకలిపోటులా ఉంది. ఒకవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో కోట్లాది మంది ఓటు హక్కుకు ముప్పు తెస్తూ, మరోవైపు అదే ఓటరు కార్డును సంక్షేమ పథకాల అర్హతకు ప్రాతిపదికగా మార్చాలనుకోవడం దారుణం. ఓటరు జాబితాలో పేరులేని వారికి సంక్షేమ పథకాలను నిలిపివేయాలనుకోవడం ప్రమాదకరమైన ఆలోచన. ఆధార్‌ను దేశంలోని ప్రతి పౌరుడికీ విశ్వసనీయమైన గుర్తింపుగా గతంలో మోడీ ప్రభుత్వమే ఊదరగొట్టింది. బ్యాంకు ఖాతాలు, రేషన్, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలతో దాన్ని అనుసంధానించింది. ఆధార్ తప్పనిసరి కాదని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చినప్పటికీ, ఆచరణలో అనేక సంక్షేమ సేవలకు దాన్నే కీలక ఆధారంగా మార్చింది. ఇప్పుడు అదే ఆధార్‌ను పక్కనపెట్టి ఓటరు కార్డును ముందుకు తేవడం ప్రజల ప్రయోజనాలతో ఆటలాడే క్రూరమైన చర్య. బయోమెట్రిక్ విధానం వల్ల గ్రామీణ పేదలు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కఠినమైన శారీరక శ్రమతో వ్యవసాయ, నిర్మాణ రంగ కార్మికుల వేలిముద్రలు అరిగిపోవడం, వృద్ధుల వేలిముద్రలు యంత్రాలకు సరిగా చిక్కకపోవడం, కొందరి కనుపాపలను ఐరిస్ స్కానర్లు గుర్తించలేకపోవడం వల్ల అర్హులకు అందాల్సిన ప్రయోజనాలు నిలిచిపోతున్నాయి. ఇ-కెవైసీకి అవసరమైన స్మార్ట్‌ఫోన్లు అనేక గ్రామీణ కుటుంబాలకు అందుబాటులో లేవు. దేశంలో 8,985 గ్రామాలకు మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేదని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బయోమెట్రిక్‌ను తప్పనిసరి చేయడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్టే అవుతుంది. కాకినాడ జిల్లా కొవ్వూరు సమీపంలో మే 16న జరిగిన రోడ్డు ప్రమాదం డిజిటల్ విధానాల దుష్పరిణామాలకు నిదర్శనం. పని ప్రదేశంలో మొబైల్ సిగ్నల్ లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలు బయోమెట్రిక్ నమోదు కోసం నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న రహదారి ప్రాంతానికి వెళ్లారు. ఆ క్రమంలో లారీ ఢీకొని నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పని ప్రదేశంలోనే హాజరు నమోదు చేసుకునే సదుపాయం ఉంటే వారు రహదారిపైకి వెళ్లాల్సిన అవసరం వచ్చేది కాదు. గ్రామీణ ప్రాంతాల్లో బయోమెట్రిక్ నమోదు ఇంతటి తీవ్ర సమస్యగా ఉన్నప్పటికీ ఇప్పుడు ఓటరు కార్డును కూడా జోడించి, మరింత కఠినతరం చేయాలనుకోవడం బాధ్యతారాహిత్యం.ఏకపక్షంగా, అస్తవ్యస్తంగా సాగిన ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మందికి ఓట్లు లేకుండా చేసింది. గోవాలో ఓటు కోల్పోయిన వారిలో 97 మంది తిరిగి ఓటు పొందడానికి సాంకేతిక, అధికార కేంద్రీకరణ లోపాలు ఎలా అడ్డంకిగా మారాయో చూశాం. పశ్చిమ బెంగాల్‌లో తుది జాబితా నుంచి 63.66 లక్షల పేర్లను తొలగించారు. తొలగింపులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లలో ఆగస్టు 7 నాటికి పరిష్కారమైన కేసుల్లో 91 శాతానికి పైగా ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాల్సి వచ్చింది. తొలగింపు ప్రక్రియలోని లోపాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్తంగా అభ్యంతరాలు, ఆందోళనలు కొనసాగుతుండగానే ఎన్నికల సంఘం మరో ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఎస్ఆర్‌ను ప్రకటించింది. ప్రజల ఆందోళనలను పట్టించుకోని మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి ఇది నిదర్శనం. ఆరునూరైనా తన మాటే చెల్లుబాటు కావాలని, తాను చేస్తున్నదంతా సరైనదేనని చెప్పుకునే ధోరణిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించటం దారుణం. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్‌సి) ప్రతిపాదనలపై గతంలో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. పౌరసత్వాన్ని మత ప్రాతిపదికన వర్గీకరించడం, పౌరులు తమ పౌరసత్వాన్ని పత్రాలతో నిరూపించుకోవాల్సిన పరిస్థితి కల్పించడంపై నిరసనలు వెల్లువెత్తాయి. ఆ చట్టాల దురుద్దేశాలే ఎస్ఐఆర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. మైనారిటీలు, పేదలు, వలస కార్మికులు పెద్ద సంఖ్యలో ఓటు హక్కును కోల్పోయారు. ఇప్పుడు వారికే సంక్షేమ పథకాలను నిలిపివేయాలనే ప్రతిపాదన అమానవీయమైనది మాత్రమే కాదు; హక్కుల ఉల్లంఘన కూడా! ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌లో పేర్లు తొలగించారనే సాకుతో రేషన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలను నిరాకరిస్తున్నారు. ఓటు హక్కు, ఆహారం పొందే హక్కు, ఉపాధి, పింఛను, వైద్యం వంటి సామాజిక భద్రతా హక్కులు వేర్వేరు. బయోమెట్రిక్ ధ్రువీకరణ విఫలమైనంత మాత్రాన అర్హులకు సంక్షేమ ప్రయోజనాలు నిరాకరించరాదని ఆధార్ చట్టం కూడా స్పష్టం చేస్తోంది. సాంకేతిక వైఫల్యానికి పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వాలే ఆ వైఫల్యాన్ని ప్రజల అనర్హతగా పరిగణించడం దుర్మార్గం. గుర్తింపు కార్డులు ప్రజలకు సేవలు అందించడానికి ఉపయోగపడాలి తప్ప, సేవలను నిరాకరించడానికి ఆయుధాలుగా మారకూడదు. ఓటరు గుర్తింపును సంక్షేమానికి తప్పనిసరి షరతుగా మార్చే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఎలాంటి సాంకేతిక ఆంక్షలు లేకుండా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ప్రయోజనాలు అందించాలి.

ఇజ్రాయెల్‌తో ఆ ఒక్కదానితోనే మనకు పోటీ!

లోకమంతా తమకు వ్యతిరేకంగా ఏకమైనట్లు భావించే వ్యక్తులూ, దేశాలూ ఏంచేసినా అతిగానే ఉంటుంది. ఇజ్రాయెల్‌ను చూస్తే ఇది స్పష్టంగా కనవడుతుంది. ఈ అతి వల్లే సమస్యలను సరైన కోణంలో చూడటం ఇజ్రాయెల్ ఎప్పుడో మరచిపోయింది. ఇటీవల అక్కడి చట్టసభకు (నెస్సెట్) జరిగిన ఎన్నికల్లో అరబ్ పార్టీలు 19 సీట్లను గెలుచుకోవటం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఘోరమైన అతిగానూ, కుట్రగానూ కనపడుతోంది. విదేశీ డబ్బుతోనే అరబ్బు పార్టీలు ఎన్నికల్లో విజయాన్ని సాధించాయని ఆరోపించారు. అంతటితో ఆగలేదు. ఎన్నికల్లో విదేశీ డబ్బు ప్రభావంపై విచారణ జరిపి, అరబ్బు ప్రతినిధుల గెలుపుపై అనర్హత వేటువేయాలనే కోరికను కూడా వ్యక్తంచేశారు. నెతన్యాహు ప్రభుత్వం వేలాది మందిని చంపి గాజాలో దారుణ మారణహోమానికి పాల్పడినా, ఇరాన్‌పై అక్రమ యుద్ధానికి దిగినా ఆశించిన విధంగా ఎన్నికల్లో ప్రజాతీర్పు రాలేదు. పార్లమెంట్‌లో పాలకకూటమికి అవసరమైన మెజారిటీ దక్కకుండా ప్రజలు తీర్పునిచ్చారు.ఇజ్రాయెల్ జనాభాలో అరబ్బులు 21.5శాతం వరకూ ఉంటారు. వాళ్లకు 19 సీట్లు రావటంలో అనహజం ఏమీలేదు. ఇజ్రాయెల్‌లోని అరబ్బులు బయట నుంచి వచ్చి అక్కడ స్థిరపడలేదు. అట్లా అనుమతించే ఉదారతను అరబ్బుల విషయంలో ఇజ్రాయెల్ ఎప్పుడూ ప్రదర్శించలేదు. ఐక్యరాజ్యసమితి తీర్మానానికి విరుద్ధంగా ఇజ్రాయెల్ ఏకపక్షంగా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న 1948 మే 14 నాటికి అక్కడ భూభాగాల్లో మిగిలిపోయిన అరబ్బులే నిజమైన భూమిపుత్రులు. వీలైనంత మంది స్థానిక అరబ్బులను ఇజ్రాయెల్ నుంచి బయటికి పంపించటానికి 1948లోనూ, ఆ తర్వాతా ఎన్నిచేయాలో అన్నీ చేశారు. ఊళ్లకు ఊళ్లనే తగులపెట్టారు. జీవనోపాధులను దెబ్బతీశారు. అరబ్బులకు ముఖ్యమైన ప్రతిదాన్నీ ధ్వంసం చేశారు. వందలేళ్ల నాటి నివాస ప్రాంతాలను నామరూపాల్లేకుండా చేశారు. చివరికి దేశం విడిచి శరణార్థులుగా పారిపోయే పరిస్థితిని కల్పించారు. అలా ఎన్ని దారుణాలకు ఒడిగట్టినా ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించుకున్న సరిహద్దుల్లోనే కొన్ని చోట్ల అరబ్బులు మిగిలిపోయారు. దేశాన్ని వీడలేకపోయారు. అట్లా వీడలేని వాళ్ల వారసులే నేటి ఇజ్రాయెల్‌లో ఉన్న అరబ్బులు. ఈ అరబ్బుల్లో ముస్లింలు కానివారూ ఉన్నారు. వారి శాతం మాత్రం జనాభాలో బాగా (2.9) తక్కువ. మొత్తంగా అరబ్బులను అనుమానంగా చూడటం, వారి దేశ విధేయతను శంకించటం చుట్టూనే అక్కడి లికుడ్ పార్టీ రాజకీయాలు తిరుగుతాయి. నెతన్యాహు ప్రధాని అయిన తర్వాత ఈ ధోరణి మరింతగా వెర్రితలలు వేస్తోంది. ఒక మతానికీ, ఒక సమూహానికీ పెద్దపీటవేసే సంకుచిత జాతీయవాదానికి ఎప్పుడూ దేశం లోపలా బయటా శత్రువులు కావాలి. దేశ సాంస్కృతిక జీవితాన్నీ, మతాన్నీ విచ్ఛిన్నం చేసే వారిగా మైనారిటీలపై శత్రుముద్రలు వేయాలి. దేశ విధేయత లేని సమూహంగా మైనారిటీల గురించి ప్రచారం చేయటం ఇజ్రాయెల్‌కే పరిమితం కాలేదు. దేశభక్తి అంటే మతభక్తే అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్న చోట్ల ఇది విస్తృతంగా సాగుతోంది. మతాధిక్యత, జాతి ఆధిక్యత భావజాలంతో కూడిన జాతీయవాదం ఎప్పుడూ ప్రమాదకరమే. కిందటి శతాబ్దంలోనూ ఈ శతాబ్దంలోనూ ప్రపంచంలో హింసాగ్నులకు ఈ వాదమే ప్రేరణ. నియంతలందరూ ఈ తరహా జాతీయవాదంతోనే అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఇంకా కచ్చితంగా చెప్పుకోవాలంటే ఇలాంటి సంకుచిత జాతీయవాదమే నియంతలను సృష్టిస్తుంది. ఆ తరహా జాతీయవాదంతో ప్రజలను ప్రేరేపించటానికి చరిత్ర రచన చాలా పనికొస్తుంది. ప్రస్తుత ఇజ్రాయెల్ భూభాగాలన్నీ ఒకప్పుడు యూదులవేనని, గాజా, వెస్ట్‌బ్యాంకు కూడా వాళ్లవేనని చెప్పే విధంగా చరిత్ర పుస్తకాలు రూపొందుతాయి. పురాతన గాథలనూ, కథలనూ ఉటంకిస్తూ చరిత్ర రచనను దాని చుట్టూ తిప్పుతారు. అరబ్బులకు ఆ భూభాగాల్లో సమాన స్థానం ఉందనే విషయాన్ని ఏరకంగానూ అంగీకరించరు. పిల్లలకు చిన్నతనం నుంచీ దీన్నే నూరిపోస్తారు. అందుకే జాతి, మత ఆధిక్యత భావాల ఆధారంగా రాజకీయాలు చేసేవాళ్లు మొదటగా చరిత్రపైనే దృష్టి పెడతారు. గతం నుంచి స్ఫూర్తిపొందని జాతి అంటూ ఉండదు. ఆ గతం తాలూకూ చిత్రం ఎలా ఉండాలి అన్న విషయాన్ని చాలా వరకూ సమకాలీన రాజకీయ అవసరాలే నిర్దేశిస్తాయి. చరిత్రలో కొందరిని నాయకులు గానూ, మరికొందరిని ప్రతినాయకులు గానూ వర్ణించటం రాజకీయ అవసరాల ప్రకారమే జరుగుతుంది. విలన్లుగా ముద్ర వేసిన వాళ్లను కొత్త ఆధారాలతో భిన్న కోణం నుంచి చూడటానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించరు. ప్రజల మనస్సుల్లో విలన్లు, హీరోల జ్ఞాపకాలు శాశ్వతంగా



ఉండటానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. శాస్త్రీయ దృక్పథంతో చరిత్రకారులెవరైనా ఆ వనికి పూనుకుంటే వాళ్లపైనే బురదచల్లుతారు. పెడార్థాలు అంటగడతారు.ఇజ్రాయెల్ రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో పోటీకి అరబ్బులపై నిషేధం లేదు. కానీ అరబ్బులు పెద్ద ఎత్తున ఓటింగులో పాల్గొన్నప్పుడల్లా వాళ్లకు దురుద్దేశాలను ఆపాదించటం నెతన్యాహుకు పరిపాటి. 2015 ఎన్నికల్లో కూడా అరబ్బు ఓటర్లతో ఇజ్రాయెల్‌కు ప్రమాదం ముంచు కొస్తోందని విమర్శించారు. అరబ్బు పార్టీలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటం జాతి ప్రయోజనాలకు విపత్తుగా వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ చేవట్టే ఏ సైనిక చర్యనైనా అరబ్బు పార్లమెంటేరియన్లు సమర్థించకపోతే వాళ్లను దేశ ప్రయోజనాలకు గండికొట్టే వారిగా ప్రచారం చేయటం లికుడ్ పార్టీకి సర్వసాధారణం. పాలస్తీనా అరబ్బులకు సంఘీభావం ప్రకటించినా, 1948కు పూర్వపు తమ గతాన్ని గుర్తుచేసుకున్నా, ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం పాలస్తీనా రాజ్యం ఏర్పాటే శాంతికి వరిష్కారమని మాట్లాడినా దేశద్రోహులైపోతారు. ఇజ్రాయెల్‌లోని అరబ్బులకు ఇప్పుడు సాధారణ పౌరుల్లాగా అన్నీ హక్కులు ఉన్నట్లు కనపడుతున్నా చాలా విషయాల్లో వాళ్లు వెనుకబడే ఉన్నారు. 1966 వరకూ ఇజ్రాయెల్‌లోని అరబ్బు ప్రజలు సైనిక పాలన కిందే మగ్గిపోయారు. ప్రయాణాలకు అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. నివాసప్రాంతాలపై ఆంక్షలు ఉండేవి. రాజకీయ కార్యకలాపాలపై నిఘా ఉండేది. ఉద్యోగాలు, విద్య వ్యవహారాలపై కఠిన నియంత్రణలు ఉండేవి. ఆ పాలనా కాలంలోనే అరబ్బుల నుంచీ వివిధ చట్టాల ద్వారా భూములను స్వాధీనం చేసుకున్నారు. సైనిక పాలన ముగిసిన తర్వాత కూడా చాలా విషయాల్లో పక్షపాతం చూపారు. అరబ్బులు ఎక్కువగా ఉన్నచోట పెట్టుబడులను తక్కువగా కేటాయించారు. అందుకే పాలస్తీనా సమస్య అంటే గాజాలోనూ, వెస్ట్‌బ్యాంకులోనూ ఉన్న ప్రజల ఇబ్బందులుగానే భావించకూడదు. ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా ప్రజల సమానహక్కుల ఆకాంక్షను కూడా ముఖ్యమైందిగానే పరిగణించాలి. యూదు ప్రజల కోసం ఒక రాజ్యం ఏర్పడటం అనేది ఒకనాడు అవసరంగా మారింది. అందులో సందేహం ఏమీ లేదు. యూదులు ఎక్కువగా ఉన్న దేశాల్లో అణచివేతలూ, ఊచకోతలూ ఒకప్పుడు సర్వసాధారణం అయ్యాయి. ఆ నేపథ్యంలో యూదులకు ఒకదేశం ఉండాలనే డిమాండు ఊపందుకుంది. దానికి బ్రిటన్ మద్దతు పలకటంతో ఇజ్రాయెల్ ఏర్పడటానికి పునాదులు పడ్డాయి. పాలస్తీనాలో అప్పటికే వందల సంవత్సరాల నుంచి జీవిస్తున్న అరబ్బుల హక్కులకు భంగం కలగకుండా ఆ దేశం ఏర్పడుతుందని బ్రిటన్ చేసిన వాగ్దానాలు గాలికికొట్టుకు పోయాయి. అరబ్బులతో సహజీవనం చేయాలన్న ఆలోచనలను యూదుల్లో అతివాదులు తొలి నుంచీ వ్యతిరేకిం చారు. అందుకే ఏదో ఒక కారణంతో పాలస్తీనా శరణార్థులను ఇజ్రాయెల్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. స్వస్థలాల నుంచీ తరిమివేసిన ప్రజలకు తిరిగివచ్చే హక్కులను తోసిపుచ్చారు. ఇది చాలదన్నట్లుగా 2018 జూలైలో ఇజ్రాయెల్ రాజ్య నిర్వచనాన్నే మార్చేస్తూ మౌలిక చట్టాన్ని తీసుకువచ్చారు. యూదు ప్రజలకే ఇజ్రాయెల్ రాజ్యమంటూ (ద నేషన్ స్టేట్ ఆఫ్ ద జూయిష్ పీపుల్) కొత్త నిర్వచనం ఇచ్చారు. 21.5శాతంగా ఉన్న అరబ్బుల వర్తిస్థితి ఏమిటి అన్నదాన్ని పట్టించుకోలేదు. యూదు ప్రజల రాజ్యమనటంలోనే ఇతర ప్రజలు ద్వితీయ పౌరులుగా మారిపోయారు. ఇజ్రాయెల్‌లో మౌలిక చట్టాన్ని రాజ్యాంగంగానే పరిగణిస్తారు. 1948 నుంచి పాలస్తీనా అరబ్బుల హక్కులను ఒక్కొక్కటిగా హరించటమో, పరిమితం చేయటమో మొదలైనా 2018 నాటి మౌలిక చట్టంతో పరిస్థితిని పూర్తిగా మార్చేశారు. దీన్ని ఎదుర్కోటానికే ఇప్పుడు అరబ్బుల్లో రాజకీయ క్రియాశీలత పెరిగింది. అందుకే ఎన్నికల్లో అరబ్బులు పెద్ద ఎత్తున పోలింగులో పాల్గొన్నారు. ఎన్నడూలేని సంఖ్యలో అరబ్బులు పార్లమెంటు స్థానాలను గెలుచుకున్నారు.దేశంలోపల అరబ్బుల, గాజా, వెస్ట్‌బ్యాంకులోని పాలస్తీనా ప్రజల న్యాయవరమైన హక్కులను విన్మరించి.. వాళ్లను శాశ్వతంగా ఇజ్రాయెల్‌కు పాదక్రాంతులుగా చేసుకోవాలన్న నెతన్యాహు కోరిక నెరవేరటం ఇప్పుడున్న ప్రపంచ పరిస్థితుల్లో అంతతేలిక కాదు. గాజా, వెస్ట్ బ్యాంకులను కూడా కలుపుకొని అఖండ ఇజ్రాయెల్‌ను ఏర్పాటుచేయటమే లక్ష్యంగా రాజకీయాలను నడుపుతూ, యుద్ధాలను చేస్తూ నెతన్యాహు ప్రభుత్వం ఇప్పటి వరకూ సాధించింది శూన్యం. పశ్చిమాసియా ఎన్నడూ లేని విధంగా సంక్షోభంలో పడిపోయింది. ఇరాన్ ప్రతిఘటన అనూహ్యస్థాయిలో అమెరికా, ఇజ్రాయెల్‌ను దెబ్బతీసింది. రాజకీయంగా అంతర్జాతీయ స్థాయిలో ఇజ్రాయెల్, అమెరికాలు ఏకాకులుగా మిగిలాయి. అరబ్బులకు న్యాయపరంగా దక్కాల్సిన భూభాగాలను ఇవ్వకుండా, పాలస్తీనా స్వతంత్ర రాజ్యం ఏర్పాటుకు మోకాలడ్డుతూ ఎన్ని దారుణాలు చేసినా ఇజ్రాయెల్‌కు భద్రతతో కూడిన స్థిరత్వం రాదు. శత్రువులు అన్నివైపులా చుట్టుముట్టి ఉన్నారన్న పరిస్థితిని చేజేతులా తెచ్చుకోవటం నిరంతరం ఎదుర్కోవాల్సిన ముప్పుగానే పరిగణించక తప్పదు. అరబ్బు ముస్లింలతో సయోధ్యపడకుండా ఎంత సైనికశక్తిని సమకూర్చుకున్నా సాధించేదేమీ ఉండదు. ఒకనాడు యూదులు ఎదుర్కొన్న దారుణాలకూ ఊచకోతలకూ అరబ్బు ముస్లింల పాత్ర ఏమీలేదు. యూదులను అణగదొక్కటంలో, నరమేధం సాగించటంలో యూరోపియన్లదే ప్రధాన పాత్ర. మధ్యయుగాల్లో యూదులకు క్రైస్తవ రాజ్యాలతో పోల్చితే ముస్లిం రాజ్యాల్లోనే ఎక్కువ భద్రత ఉండేది. 1900 సంవత్సరంలో యూదుల జనాభా ప్రపంచవ్యాప్తంగా కోటీ పది లక్షలు ఉంటే అందులో యూరపులోనే 90 లక్షలు ఉండేవారు. ఆనాటి రష్యను సామ్రాజ్యంలో 40 లక్షల దాకా నివసించేవారు. పాలస్తీనాలో అప్పటికి కేవలం 78,000 మంది మాత్రమే యూదులు ఉన్నారు.ఇజ్రాయెల్ యూదులతో పోల్చితే అరబ్బులు అన్నిరంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారనటంలో సందేహం లేదు. అన్ని విషయాల్లోనూ ఇజ్రాయెల్‌ను ఆదర్శంగా తీసుకోవాలనే మన దేశ నాయకులు కొందరికి రుచించని విషయాలు కూడా అక్కడ ఉన్నాయి. భారత్‌లో ముస్లిం లోక్‌సభ సభ్యులు 4.42శాతం మాత్రమే ఉన్నారు. కానీ ఇజ్రాయెల్‌లో అరబ్బు ఎంపీలు 15.83శాతం ఉన్నారు. పౌర ఉద్యోగాల్లో 13.2 శాతాన్ని అరబ్బులు సాధించారు. సచార్ కమిటీ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 4.9శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. అరబ్బుల ప్రాతినిధ్యం కిందిస్థాయి ఉద్యోగాల్లో ఇజ్రాయెల్‌లో ఫర్వాలేదని అనుకుంటున్నా వారు దేశాన్నే కోల్పోయారు. దాంతో దేన్నీ వెలకట్టలేం. కానీ ఇజ్రాయెల్‌తో ఒక విషయంలో మాత్రం మనం పోటీపడుతున్నాం. అది చరిత్ర రచనల్లో వ్రన్పుటంగా కనపడుతోంది. ముస్లింల ఘనకార్యాలన్నీ పోయి క్రమేపీ వారి ఘోరచరిత్రలు మాత్రమే నమోదవుతున్నాయి! ఈ విషయంలో భారత్ ఇజ్రాయెల్‌కు గట్టిపోటీని ఇస్తోంది!

రాహుల్ కుమార్

2027 క్యాలెండర్లు, డైరీల ఆన్‌లైన్ బుకింగ్ షురూ

(మొదటిపేజీ తరువాయి)

తిరుమలకు వచ్చి క్యూ లైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు టీటీడీ ఈ డిజిటల్ సేవను తీసుకొచ్చింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు నేరుగా వారి ఇంటికే డెలివరీ చేసేందుకు చర్యలు చేపట్టింది. స్పెషల్ బుకింగ్ విధానం..క్యాలెండర్లు, డైరీలు కావలసిన భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ http://ttdevasthanams.ap.gov.in/home/ ఉంష్ణఎశీఘతీఽను సందర్శించి సులభంగా తమ బుకింగ్స్ నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు వెల్లడించారు. 12 పేజీల క్యాలెండర్లు, శ్రీవారి పెద్ద క్యాలెండర్లు, టేబుల్ టాప్ క్యాలెండర్లతో పాటు వివిధ రకాల డైరీలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని దేవస్థానం కోరింది.

రాష్ట్రం బియ్యం ధరలపై సర్కార్ సీరియస్...

(మొదటిపేజీ తరువాయి)

నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. వ్యాపారులు నియమ నిబంధనలకు కట్టుబడి విక్రయాలు జరపాలని సూచించారు. మార్కెట్‌లో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లుగా గమనిస్తే, వెంటనే ఆ సమాచారాన్ని పౌరసరఫరాల శాఖకు అందజేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై నిరంతరం నిఘా ఉంటుందని వెల్లడించారు.

ప్రైవేట్ పాఠశాలలకు

విద్యాశాఖ హెచ్చరిక..

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యాయుల అవగాహన..

UDISEG రికార్డుల ప్రకారం పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ నిర్దేశించిన 'ప్రశస్త్' అవగాహన కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు అందరూ 'ప్రశస్త్' పోర్టల్‌లో ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. పాఠశాలల్లోని నాన్-టీచింగ్ స్టాఫ్ అందరికీ ప్రిన్సిపాల్, హెచ్ఎం లాగిన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని పూర్తి చేయించాలి. నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలో అర్హులైన పిల్లలందరికీ 'ప్రశస్త్' స్క్రీనింగ్ ప్రక్రియను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని విద్యా శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అమలులో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పూర్తి సహకారం అందించాలని తెలిపారు. నిర్దేశిత ప్రక్రియను పూర్తి చేయడంలో విఫలమైనా, నిర్లక్ష్యం వహించినా ఆయా పాఠశాల యాజమాన్యాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని విద్యాశాఖ తీవ్రంగా హెచ్చరించింది.

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు..

(మొదటిపేజీ తరువాయి)

అసలు ఏం జరిగిందంటే..?

రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ూ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు దాఖలు చేసిన వినతిని పరిశీలించాలని గతంలో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. 2025 ఆగస్టులో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 60 రోజుల్లోగా ఆ వినతిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, కోర్టు నిర్దేశించిన 60 రోజుల గడువు ముగిసినప్పటికీ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ నమోదైన తర్వాతే యంత్రాంగం కదిలింది. అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. ఆ తర్వాత జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే ఇలా ప్రక్రియను చుట్టేయడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఉల్లంఘనపై విచారణ.. సంచలన తీర్పు

న్యాయస్థానం ఆదేశించిన సమయంలో స్పందించకుండా, పిటిషన్ దాఖలయ్యాక నామమాత్రంగానే ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన హైకోర్టు, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని స్పష్టం చేస్తూ ధర్మాసనం కఠిన నిర్ణయం తీసుకుంది.

ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో ఘనంగా దీపావళి వేడుకలు

నిర్భయవార్త ప్రతినిధి : కోరుట్ల :



ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ అయిన బ్రహ్మకుమారిస్ మెడిటేషన్ సెంటర్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు అనంతరం కోరుట్ల రాజయోగ సెంటర్ ఇంచార్జి బీకే రాజేశ్వరి దీపావళి పండగ యొక్క ఆధ్యాత్మిక ప్రాముఖ్యత గురించి వివరిస్తూ దీపావళి అంటే మనలోని లోపాలు, బలహీనతలు, నిర్బలత, సున్నితత్వము మిగిలిపోయిందో, ఆ పాత ఖాతా అంతటినీ ఈ రోజు నుండి సదా కాలం కొరకు సమాప్తము చేయడం అని అలా సమాప్తం చేసినప్పుడుదివ్యగుణధారులుగా అవుతారు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఈశ్వరీయ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో భాగ్యనగరం..

(మొదటిపేజీ తరువాయి)

దీపావళి తర్వాత మరింత దిగజారిన పరిస్థితి..

ఇప్పటికే కాలుష్య సమస్యతో సతమతమవుతున్న హైదరాబాద్‌కు దీపావళి వేడుకలు గాలి నాణ్యతను మరింత దెబ్బతీసింది. పండుగ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటినా పటాకులు కాల్చడం కొనసాగింది. బంజారాహిల్స్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, ఎన్ఆర్ నగర్, అమీర్‌పేట్, సోమాజిగూడ ప్రాంతాల్లో టపాసుల మోతతో గాలిలో పొగ, ధూళి కణాల సాంద్రత పెరిగింది. దీపావళి రాత్రి 9.30 గంటల సమయంలో హైదరాబాద్ నగర సగటు ఓక్యూఐ 509 పాయింట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు 392 మైక్రోగ్రాములుగా నమోదైంది. సాధారణంగా పేర్కొన్న 60 మైక్రోగ్రాముల పరిమితితో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అలాగే పీఎం10 స్థాయిలు కూడా 326 మైక్రోగ్రాములకు చేరినట్లు సమాచారం. సాధారణ పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం నమోదవుతున్న స్థాయిలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ఉదయానికి నగర సగటు ఏక్యూఐ 160 పాయింట్లుగా నమోదైంది.

దేశ రాజధాని ఢిల్లీలో గ్యాస్ చాంబర్‌ను తలపిస్తున్న పరిస్థితి..

ఇదిలా ఉంటే దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరింత ప్రమాదకరంగా మారింది. నగరాన్ని దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్య నియంత్రణ కమిటీ గణాంకాల ప్రకారం.. నవంబర్ 9 తెల్లవారుజామున పంజాబీ బాగ్ ప్రాంతంలో ఘీవీ2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు ఏకంగా 993 మైక్రోగ్రాములకు చేరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లూహెచ్ఓ) సూచించిన 24 గంటల సగటు మార్గదర్శక పరిమితి 15 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది దాదాపు 66 రెట్లు అధికం. ఆర్.కే. పురంలో 61.6 రెట్లు, వివేక్ విహార్‌లో 58.2 రెట్లు అధికంగా కాలుష్యం నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. బురారీ క్రానింగ్‌లో ూూ× 441, రోహిణిలో 430 పాయింట్లుగా రికార్డయ్యాయి. ఆనంద్ విహార్, బవానా ప్రాంతాల్లో పర్యవేక్షణ కేంద్రాల డేటా అందుబాటులో లేకపోవడంతో వాస్తవ పరిస్థితిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

మరో ఢిల్లీగా హైదరాబాద్

హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, నిర్మాణ పనుల నుంచి వెలువడే దుమ్ము, రోడ్లపై పేరుకుపోయిన ధూళి, పారిశ్రామిక ఉద్గారాలకు పండుగ కాలుష్యం తోడవడంతో పరిస్థితి చేయి దాటుతోంది. దీపావళి ప్రభావంతో తాజాగా గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో ప్రభుత్వం, అధికారులు తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లేక పోతే అతి త్వరలోనే హైదరాబాద్ కూడా మరో ఢిల్లీగా మారే ప్రమాదం ఉందని నిపుణులు, పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ 2వ వార్షికోత్సవ వేడుకలు

విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన కమిటీ సభ్యులు

సమాచార హక్కు చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



నిర్భయవార్త ప్రతినిధి :

రాజన్నసిరిసిల్ల :

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ అగ్రహారం డిగ్రీ కళాశాల లో ఘనంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ 2వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ప్రెసిడెంట్ పులి మధుకర్ ఆధ్వర్యంలో అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ గత రెండు సంవత్సరాలుగా చేపట్టిన ప్రజా చైతన్య కార్యక్రమాలు, సమాచార హక్కు చట్టం-2005 అమలు, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలన, అధికారుల జవాబుదారీతనం వంటి అంశాలపైచర్చించారు.అదేవిధంగా సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెకో ప్రతినిధి -- ప్రతి గ్రామానికి ఒక ప్రతినిధి కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో సంస్థ కమిటీలను ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలో ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడం, ప్రజా సమస్యలను గుర్తించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా కృషి చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతి గ్రామానికి ఒక ప్రతినిధిని నియమించడం ద్వారా గ్రామస్థాయిలో ప్రజల గొంతుకగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామనిపేర్కొన్నారు.సమాచార హక్కు చట్టం అనేది సామాన్య పౌరుడి చేతిలో ఉన్న శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన పెంపొందించుకొని అవినీతికి వ్యతిరేకంగా, పారదర్శకమైన పాలన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సంస్థను జాతీయ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు మరింత బలోపేతం చేస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజా ప్రయోజన కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.సంస్థ రెండవ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శంకర్, డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రెసిడెంట్ పులి మధుకర్, జనరల్ సెక్రటరీ గోస్కుల నాంపల్లి, కన్వీనర్ కంటే మల్లయ్య, ఇంచార్జ్ నర్సింగోజ్ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లూరి సంతోష్, బైరి రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ చంద్ర భాస్కర్, గోనెల రాజు, సెక్రటరీలు అనంతుల రాజు, గోడిసేల చంద్రమౌళి, మెరుగు గణేష్ రాజు, గొల్లపల్లి మైపాల్, జాయింట్ సెక్రటరీలు బూర సురేష్, పార్వతీ ప్రశాంత్, రాగల రాజమౌళి, ఉప్పుల మల్లేష్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు మల్లెవేని సురేష్, వేములవాడ మున్సిపాలిటీ అధ్యక్షులు చేకూర్తి నవీన్, వేములవాడ రూరల్ మండలం అధ్యక్షులు పోగుల వేణు కుమార్, వేములవాడ రూరల్ ప్రధాన కార్యదర్శి మల్లేవేని కమలాకర్, వేములవాడ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి పిట్టల దేవరాజు, బోయినవల్లి మండలం కార్యకర్తబొజ్జ రాకేష్ పాల్గొన్నారు.



22 వ వార్డ్ లోని ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి పండుగ చేసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఇందిరమ్మ పథకం ద్వారా సొంత ఇల్లు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకున్న ఇళ్లలో దీపావళి వెలుగులు నిండాయి

22 వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్

నిర్భయవార్త ప్రతినిధి : వేములవాడ :

వేములవాడ పట్టణంలోని 22వ వార్డు లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దీపావళి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22 వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత - అజయ్ మాట్లాడుతూపేద ప్రజల సొంతింటి కలను సహకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగను జరుపుకునేందుకు మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి అనే కార్యక్రమాన్ని చేపట్టిందని దానిలో భాగంగానే లబ్ధిదారులంతా ఎంతో సంతోషంగా వారు నిర్మించుకున్న ఇళ్లలో ఘనంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారని పేద కుటుంబాల ఇళ్లలో దీపాల వెలుగులు నింపడం వారి జీవితాల్లో ఆనందాన్ని నింపడమే ప్రభుత్వ లక్ష్యం అని ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారం కావడం ఆనందకరమని ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించడం ద్వారా వారి లో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం జరుగుతుందని సొంతింటిలో వెలిగే దీపం.. పేద కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులకు ప్రతీకగా నిలుస్తుందని వారన్నారు. దీనికి కృషి చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు పేదలకు భరోసాగా ఉంటూ తన ప్రయాణం పేదల కోసం తన కృషి పేదల కోసం తన జీవితాన్ని పేదల కోసం పనిచేస్తూ ఇందిరమ్మ ఇల్లు రావడానికి ఎంతో సహకారం చేశారని ఈ సందర్భంగా లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో





రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్,వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, వేములవాడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, ఆత్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ ప్రజల పలు సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి: భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ



భద్రాచలం నవంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి. ప్రభుత్వ ఆదేశముల మేరకు డివిజన్ పరిధిలోని మండలాల ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలె క్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగినదని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు వివిధ సమస్యల కొరకు ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో ముఖ్యంగా రెవిన్యూ సమస్యలు, పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలతో పాటు పలు సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత డివిజన్ అధికారులకు పంపుతూ, ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి, నిర్ణీత గడువులో పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీఏవో భగవాన్ రెడ్డి, నయబ్ తాసిల్దార్ వినయ్ శీల శ్రీరామ్, భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ఆదేశాలు.. 50 దరఖాస్తుల స్వీకరణ



మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ నవంబర్ 09 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం నత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మాలతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 50 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితుల అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. అర్జీదారులతో అధికారులు బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లి ఎస్సైగా వి. రమేష్ బాధ్యతల స్వీకరణ



కారేపల్లి 9 నిర్భయవార్త రిపోర్టర్ : కారేపల్లి పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్స్పెక్టర్‌గా (ఎస్సై) వి. రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై వి. రమేష్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏవైనా సమస్యలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

నవంబర్ 11న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సమ్మేళనం




కారేపల్లి నవంబర్ 9 నిర్భయవార్త రిపోర్టర్. చీమలపాడు, కారేపల్లి, ఎన్కూర్ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులకు ముఖ్య ప్రకటనవిద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు చూపించేందుకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (జ+=ళీ-1, వరంగల్) ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సమ్మేళనం నవంబర్ 11, 2026 (బుధవారం) ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించనున్నారు.సమ్మేళనం వివరాలు: తేదీ: 11-11-2026 (బుధవారం) సమయం: ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు స్థలం: 33/11 కేవీ సబ్‌స్టేషన్, చీమలపాడు విద్యుత్ వినియోగదారులకు జిల్లా స్థాయిలో విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ బిల్లులు, మీటర్ సమస్యలు, సరఫరాలో అంతరాయాలు, కొత్త కనెక్షన్లు, ఇతర విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు లేదా ఇబ్బందులు ఉన్నట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.జ+=ళీ నిర్వహించే ఈ సమ్మేళనం ద్వారా వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఫిర్యాదు పరిష్కార వేదిక అధికారుల దృష్టికి తీసుకువచ్చి, తగిన పరిష్కారం పొందవచ్చని తెలిపారు.కావున చీమలపాడు కారేపల్లి, ఎన్కూర్ పరిసర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని కోరారు.

అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

ప్రతి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి: ఐటీడీఏ పీవో బి.రాహుల్





భద్రాచలం నవంబర్ 9 నిర్భయ వార్త ప్రతినిధి : ఎంతో నమ్మకంతో మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు మరియు వివిధ రకాల సమస్యల గురించి గిరిజన దర్బార్లో అర్జీలు పెట్టుకునే గిరిజనులకు సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన గిరిజన దర్బార్లో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎ డి ఎం హెచ్ ఓ సైదులతో కలిసి వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించారు.తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈరోజు గిరిజన దర్బార్ లో ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, పోడు పట్టాలలో పేర్లు మార్పు కొరకు, నూతనంగా పోడు పట్టాలు ఇప్పించుట కొరకు, రైతుబంధు రుణాలు ఇప్పించుట కొరకు, వ్యక్తిగత సమస్యలు,ఎం ఎస్ ఎం ఈ పథకము ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించుట కొరకు, కొత్తగా ఏర్పాటు చేసే మత్స్యకార సొసైటీల అనుమతి కొరకు, సౌర గిరి జల విద్యుత్ ద్వారా వ్యవసాయానికి సంబంధించి కరెంటు, బోరు, మోటారు ఇప్పించుట కొరకు, గిరిజన గ్రామాలు మరియు పంట పొలాలలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించుట కొరకు, మరియు జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత రుణాలు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి పొందుటకు శిక్షణలు ఇప్పించుట కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, కళ్యాణ లక్ష్మి, రైతు బంధు, ఒంటరి మహిళలకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇప్పించుట కొరకు, కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్ లు, పెట్టుకోవడానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించుట కొరకు, గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం అందించుట కొరకు మరియు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో ద్వారా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీఓ పవర్ వేణు, ఇంచార్జ్ డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కొండరెడ్ల విభాగం అధికారి భూక్య గన్యా, ఎల్ టి ఆర్ డి టి మనిధర్, హౌసింగ్ ఏఈ హేమంత్, ఏవో సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, హెచ్ ఈ ఓ కృష్ణయ్య, ఇతర విభాగాల సిబ్బంది నరేందర్, స్వాతి, ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు.

అప్పాయిగూడెంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి దీపాలు వెలిగించిన సర్పంచ్ దండు ప్రవీణ్



కారేపల్లి నవంబర్ 9 నిర్భయవార్త రిపోర్టర్.ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. ఈ నేపథ్యంలో సింగరేణి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటి వద్ద ప్రత్యేకంగా దీపాలు వెలిగించి పండుగ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా హారతులు పట్టి దీపాలు వెలిగించగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడం ద్వారా ఒక పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరడంతో పాటు వారి జీవితాల్లో సంతోషం, భద్రతకు కొత్త ఆశలు చిగురించాయని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సొంతింటిలో దీపావళి పండుగ జరుపుకోవడం ఆ కుటుంబానికి మరపురాని అనుభూతి అని అన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, ఒక కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఈ వేడుక చాటిచెప్పింది. పేద కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే నిజమైన పండుగ అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామస్తుల ప్రశంసలు అందుకుంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగులు,గ్రామ మహిళలు, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని దీపావళి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

ప్రజాదివాస్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్.



ఖమ్మం నవంబర్ 9 నిర్భయవార్త రిపోర్టర్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజాదివాస్) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్.



ఖమ్మం, నవంబర్- 09 నిర్భయవార్త రిపోర్టర్. : ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ , అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ఎల్నినో నేపథ్యంలో పంట రుణాల వడ్డీ మాఫీ చేసి రెన్యువల్ చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి పత్తికి, మిర్చికి 50 వేల రూపాయలు వరి పంటకు 30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, పంటల బీమా పథకం అమలు చేయాలని, కూరగాయల, పండ్ల తోటలను కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.బోనకల్ మండలం మోటమర్రి గ్రామ సర్పంచ్ ఎం. సురేష్ గ్రామ పరిధిలోని ఇసుక క్వారీ నుండి ఇసుక రవాణా కొరకు అధికారికంగా అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మైన్స్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెనుబల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ కొండ్రుపాడు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుని కేటాయించవలసిందిగా కోరుతూ గ్రామ పెద్దలు దరఖాస్తు సమర్పించగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ ప్రాధాన్యత క్రమంలో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిఓ 59 దరఖాస్తుల పరిశీలన పురోగతిపై సంబంధిత జిల్లా అధికారులను అడిగి, ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలనీ, భూమి విస్తీర్ణం, హద్దులు, భూమి స్వభావాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలనీ సూచించారు.
ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత, ఆత్మీయతకు వేదికగా వన సమారాధన.

కులబాంధవులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
మున్నూరు కాపు ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు పగడాల మంజుల



కారేపల్లి, నవంబర్ 9 నిర్భయవార్త రిపోర్టర్. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన చెరుకూరి వారి మామిడి తోటలో నిర్వహించనున్న కార్తీకమాస వన సమారాధన కార్యక్రమం ద్వారా కులబాంధవులంతా ఐక్యతను చాటాలని మున్నూరు కాపు సంఘం ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు పగడాల మంజుల పిలుపునిచ్చారు.సోమవారం కారేపల్లిలో నిర్వహించిన సింగరేణి మండల మున్నూరు కాపు సంఘం కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కులబాంధవుల మధ్య ఐక్యత, ఆత్మీయత, సోదరభావం, పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు వన సమారాధన వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ నెల 15న జరిగే వన సమారాధనకు ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అదేవిధంగా మధిర పట్టణంలో నిర్వహించనున్న వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కూడా మున్నూరు కాపు కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం సింగరేణి మండల అధ్యక్షుడు గమిడి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ముత్యాల సురేష్, కోశాధికారి వాకాటి సురేష్, నాయకులు కడియాల సుధాకర్, తేళ్ల శ్రీనివాసరావు, పగడాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో నూతన ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం


రోజుకు 500 నుంచి 600 మందికి సేవలు.. ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ బుకింగ్ సౌకర్యం





ఉప్పల్ నవంబర్ 09 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజలకు ఆధార్ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఉప్పల్ మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్ సి-870, నాగోల్ వైపు నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి. సంగీత, ఐఏఎస్ ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం కేంద్రాన్ని ప్రారంభించి, అక్కడి సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన కేంద్రం ద్వారా రోజుకు సుమారు 500 నుంచి 600 మందికి ఆధార్ సంబంధిత సేవలు అందించే సామర్థ్యం ఉందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆన్‌లైన్ ద్వారా ముందస్తు టోకెన్ బుకింగ్ సదుపాయం కల్పించామని, అపాయింట్‌మెంట్ బుక్ చేసుకుని నిర్దేశిత సమయానికి కేంద్రానికి రావచ్చని సూచించారు. నూతన ఆధార్ నమోదు, 5 మరియు 15 ఏళ్ల వయస్సులో తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా నిర్వహిస్తారని, డెమోగ్రాఫిక్ అప్‌డేట్‌కు రూ.75, బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.125 రుసుము ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిర్దేశిత రుసుములు మాత్రమే చెల్లించి అధికారిక కేంద్రాల్లో సేవలు పొందాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చే వారికి అవసరమైన సహకారం అందిస్తూ సేవలను వేగంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సూచించారు. ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ కోసం: https://appointments.uidai.gov.in/bookappointment.aspxఈ కార్యక్రమంలో యూఐడీఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ కె.ఎం. భారతి, డిప్యూటీ డైరెక్టర్ నాయిని శ్రీ రంగనాథ్ రెడ్డి, తెలంగాణ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ చంద్ర, అసిస్టెంట్ మేనేజర్ పి. రత్నాకర్‌తో పాటు బీఎల్‌సీ ఇంటర్నేషనల్ సర్వీసెస్ ప్రాంతీయ మేనేజర్ శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ దుగ్గి హరినాథ్, ఆపరేషన్స్ మేనేజర్ సి. కార్తీక్, సెంటర్ మేనేజర్ బి. వెంకన్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు నిరంతర నిఘా అవసరం: డాక్టర్ కె. ఆనంద్



మల్కాజిగిరి నవంబర్ 09 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి : మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాల అమలును సమీక్షించేందుకు రాష్ట్ర స్థాయి అధికారులు మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీలో మలేరియా, డెంగ్యూ కేసుల వివరాలు, ల్యాబొరేటరీ రికార్డులు, పరీక్షల నమోదు, కేసుల పర్యవేక్షణను అధికారులు పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించి, జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వ్యాధుల నియంత్రణకు క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా, లార్వా నిర్మూలన, కేసుల పర్యవేక్షణతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి. నాగరాజు, ఎంటమాలజిస్ట్/కన్సల్టెంట్ మలేరియా అధికారి సైదులు, డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్, వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఇటుక బట్టీల బాగోతంపై కదిలిన అధికారులు..!

వార్తా కథనాలతో స్పందించిన అధికారులు.!
క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి.!
అనుమతి పత్రాలు సమర్పించాలని నిర్వాహకులకు ఆదేశాలు.!



పినపాక, నవంబర్ 09, నిర్భయ వార్త ప్రతినిధి. మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వ్యవహారంపై ప్రచురితమైన వరుస వార్తా కథనాలు అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చాయి. ఇన్నాళ్లూ పట్టించుకోని ఇటుక బట్టీల వ్యవహారంపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. ఇందులో భాగంగా తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఇటుక బట్టీల నిర్వహణ ప్రాంతాలను పరిశీలించారు. బట్టీల నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు, వాటి నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రాలను సమర్పించాలని ఆదేశించారు.

అనుమతులపై ఆరా..

ఏడూళ్ల బయ్యారం కేంద్రంగా మండల పరిధిలో పలు ఇటుక బట్టీలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తున్నారనే అంశంపై గత కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన రెవెన్యూ అధికారులు బట్టీలకు సంబంధించిన అనుమతులు, నిర్వహణకు అవసరమైన ధ్రువపత్రాలపై ఆరా తీస్తున్నారు. నిర్దేశిత గడువులోగా పత్రాలు సమర్పించాలని నిర్వాహకులకు స్పష్టం చేసినట్లు తెలిసింది.

తదుపరి చర్యలపై ఉత్కంఠ..

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనతో ఇటుక బట్టీల నిర్వాహకుల్లో చర్చ మొదలైంది. కేవలం పత్రాలు అడిగి వదిలేస్తారా? లేక నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బట్టీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా? అన్నది ఇప్పుడు మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అనుమతులు లేని బట్టీలపై విచారణ జరిపి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వార్తా కథనాల ప్రభావంతోనైనా అధికార యంత్రాంగం కదలడంతో, ఇకనైనా అక్రమ ఇటుక బట్టీల వ్యవహారానికి అడ్డుకట్ట పడుతుందా? అన్నది వేచి చూడాలి.

కారేపల్లిలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.


కాంగ్రెస్ నాయకులు.. కేక్ కటింగ్, మిఠాయిల పంపిణీ



కారేపల్లి నవంబర్ 9 నిర్భయవార్త రిపోర్టర్. : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం కారేపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కారేపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. అదేవిధంగా మాణిక్యారం గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు అదనపు సంక్షేమ పథకాలను చేపడుతూ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. కొత్తగా అర్హులైన పేదలకు పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడం ద్వారా నిరుపేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు సత్సంబంధాలు కలిగి ఉండి, నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రజా నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, ఇమ్మడి తిరుపతిరావు, భూక్య రంజిత్ కుమార్, సురేందర్ మనియార్, గుగులోత్ భీముడు, పొలగాని శ్రీనివాస్, కడియాల సుధాకర్, గమిడి నర్సింహారావు, హనీఫ్,సర్పంచులు బానోత్ హీరాలాల్, ఈసం మోతీరస్వామి, దండు ప్రవీణ్, గుగులోత్ వరలక్ష్మి రాజు, భూక్య బాలు, బోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మిత్రుడి పెళ్లిరోజు సందర్భంగా అభిమానం చాటుకున్న ఓదెల నరేష్

రమేష్-మమత పెళ్లిరోజు సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించిన ఓదెల నరేష్



నిర్భయవార్త ప్రతినిధి :వేములవాడ :

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన ఓదెల నరేష్ 2010-12 ప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధర ఇంటర్ మిత్రుడు రమేష్ పెళ్లిరోజు సందర్భంగా వారికి ఫోన్ చేసి పెంచాలపల్లి వ నివాసంలో పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపడం జరిగింది వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో నూరేళ్లు చల్లగా ఉండాలని ఇంటర్ మిత్రుడు ఓదెల నరేష్ కోరుకున్నారుఈ కార్యక్రమంలో రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రకార్యాలయంలో ఘనంగా రెండవ వార్షికోత్సవ వేడుకలు.. కేక్ కటింగ్ కార్యక్రమం



నిర్భయవార్త ప్రతినిధి హైదరాబాద్

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్రకార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీ దేశాల భూపాల్ సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ ఉపాధ్యక్షులు గోపీనాథన్ కట్టెకోలా, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరవింద స్వామి, కె. సాయిరాం, రాష్ట్ర కార్యదర్శులు రావుల నవీన్ కుమార్, లక్ష్మి అన్నపూర్ణ, రజని, శరత్ కుమార్, నాగజ్యోతి, రేణు కుమార్, క్రాంతి కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎ. శ్రీకాంత్ రెడ్డి, హెచ్. అశోక్ కుమార్, బావయ్య, సాయిబాబు, సుధీర్, సంజీవ్, మహేష్ తదితరులకు హృదయపూర్వకధన్యవాదాలుతెలిపారు. సంస్థ మరిన్ని విజయాలు సాధిస్తూ, సమాచార హక్కు చట్టం పరిరక్షణ, ప్రజల్లో అవగాహన, అవినీతి నిర్మూలన, పారదర్శక పాలన కోసం దేశవ్యాప్తంగా మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు.

కృష్ణ గోపాల్ సేవా సమితి' ఆధ్వర్యంలో ఘనంగా అమావాస్య అన్నదాన కార్యక్రమం

దాదాపు 800 మందికి అన్నదానం






నిర్భయవార్త ప్రతినిధి నస్థలిపురం

సమాజ సేవయే ధ్యేయంగా నిరంతరం సేవా కార్యక్రమాల్లో ముందుండే కృష్ణ గోపాల్ సేవా సమితి అమావాస్య వర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమం విజయవంతమైంది. పవిత్రమైన ఈ రోజున సమాజంలోని నిరుపేదలు, ఆకలితో ఉన్న సుమారు 700 నుండి 800 మందికి సమితి సభ్యులు కడువునిండా అన్నప్రసాదాన్ని స్వయంగా వడ్డించి వారి ఆకలిని తీర్చారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ... "మానవ సేవే మాధవ సేవ" అనే ఉన్నతమైన ఆశయంతో తమ సమితి ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్నదానం అన్ని దానాల్లోకెల్లా విశిష్టమైనదని, ఇంతమంది ఆకలిని తీర్చడంలో భాగస్వామ్యం కావడం తమకెంతో తృప్తినిచ్చిందని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి నిరంతరం శ్రమించిన సేవా సమితి సభ్యులకు, ఉదారంగా సహకరించిన దాతలకు, అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ సమితి ప్రతినిధులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆదరాభిమానాలు, ప్రోత్సాహం ఇలాగే కొనసాగితే మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలనుకునేవారికి పిలుపు:

రాబోయే రోజుల్లో కృష్ణ గోపాల్ సేవా సమితి చేపట్టే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునేవారు, లేదా తమవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే దాతలు సమితి ప్రతినిధులను 81068 76 999 నంబర్‌లో సంప్రదించవచ్చని నిర్వాహకులు కోరారు.

వందేళ్ల ప్రస్థానంలో స్వార్థం లేని 'స్వయంసేవకులే' ఆర్ఎస్ఎస్‌కు గుర్తింపు: మోహన్ భాగవత్



న్యూఢిల్లీ :నిర్భయవార్త ప్రతినిధి :

వందేళ్ల ప్రస్థానంలో స్వార్థం లేని 'స్వయంసేవకులే' ఆర్ఎస్ఎస్‌కు అసలైన గుర్తింపు అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజ శ్రేయస్సు కోసమే పనిచేసేవారే ప్రచారకులని పేర్కొన్నారు. సోమవారం నాగ్‌పూర్ నాగరిక్ సహకారి బ్యాంక్ నూతన ఆడిటోరియాన్ని మోహన్ భాగవత్ ప్రారంభించి, ప్రసంగించారు. 1930లలో ఆర్ఎస్ఎస్‌పై తొలి నిషేధ యత్నం నాటి ఆసక్తికర ఘట్టాన్ని ఈ సందర్భంగా మోహన్ భాగవత్ గుర్తుచేశారు. నాటి రోజుల్లో ఆర్ఎస్ఎస్‌ను సమర్థించే స్వయంసేవకులు, భావజాల మద్దతుదారులు గానీ సెంట్రల్ ప్రావిన్స్ అసెంబ్లీలో లేరని చెప్పుకొచ్చారు. ఆర్ఎస్ఎస్‌పై తొలి నిషేధయత్నం జరిగినప్పుడు సభలో మద్దతు తెలిపిన ఏకైక వ్యక్తి ఇబ్రహీం అని ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్ మతతత్వ సంస్థ కాదని, నిషేధించవద్దని నాటి సెంట్రల్ ప్రావిన్స్ అసెంబ్లీలో ఇబ్రహీం వాదించారని మోహన్ భాగవత్ పేర్కొన్నారు.

యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే యూత్ పార్లమెంట్ లక్ష్యం

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు.. రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురి ఎంపిక





నిర్భయవార్త ప్రతినిధి : సిద్దిపేట:

యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ (మై భారత్) సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేటలోని ఓ.యూ.పీ.జీ. కళాశాలలో జిల్లా స్థాయి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'లో భాగంగా 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026-27' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 'నషా ముక్త్ యువ -- డ్రగ్ ఫ్రీ ఇండియా' అనే అంశంపై జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలన, యువత బాధ్యత, సమాజ అభివృద్ధి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను, ఆలోచనలను ప్రసంగాల రూపంలో సమర్థవంతంగా వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ జాదవ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల, దేశ పురోగతి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ సామర్థ్యాలను, వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు.పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మొదటి బహుమతిని సిద్దిపేటకు చెందిన శ్రీహిత రెడ్డి, రెండో బహుమతిని ఓ.యూ.వీ.జీ. కళాశాలకు చెందిన సాజియా మెహవష్, మూడో బహుమతిని అదే కళాశాలకు చెందిన గిరిమల్ల హ్యాలేఖ సాధించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్, తెలంగాణ యూనివర్సిటీ కామారెడ్డి ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య, సిద్దిపేట అడ్వకేట్ కె. వినోద్, డాక్టర్ నర్సింలు, కళాశాల అధ్యాపక బృందం, మై భారత్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డబ్బుతో రాజకీయాలు వద్దు.. సేవాభావమే ప్రాతిపదిక కావాలి: సీఎం చంద్రబాబు



నిర్భయవార్త ప్రతినిధి :అమరావతి :

స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగాయని, హింసను, రౌడీయిజాన్ని ప్రజలు తిరస్కరించారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హుద్‌హుద్ తుపాను సమయంలో విశాఖ ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ప్రజలు తమకు ఘనవిజయం అందించారని పేర్కొన్నారు. డబ్బుతో రాజకీయాలు చేయడం సరికాదని, సేవాభావమే రాజకీయాలకు ప్రాతిపదిక కావాలని ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో డబ్బు పంచడాన్ని చాలా వరకు తగ్గించి విజయం సాధించామని, దేశంలో అవినీతి నిర్మూలనకు రూ.500 నోట్లను రద్దు చేసి రూ.100, రూ.200 నోట్లతో పాటు డిజిటల్ కరెన్సీని మాత్రమే ప్రోత్సహించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని, మొత్తం మీద కూటమికి 58.90 శాతం ఓట్లు రాగా, వైయస్సార్సీపీకి 33.56 శాతం ఓట్లు మాత్రమే లభించాయని సీఎం చంద్రబాబు తెలిపారు. 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే వైసీపీ ఓట్ల శాతం ఏకంగా 6.25 శాతం తగ్గిపోయిందని, కూటమికి, వైసీపీకి మధ్య దాదాపు 25.34 శాతం ఓట్ల ఆధిక్యత ఉందని వివరించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కూటమి ఏకంగా 59.9 శాతం ఓట్లతో 94 శాతం స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసిందని, పట్టణాల్లో రెండు పార్టీల మధ్య 25 శాతం వ్యత్యాసం ఉందన్నారు. జెడ్పీటీసీ స్థానాల్లో కూటమికి 57.6 శాతం ఓట్లతో పాటు 87.5 శాతం స్ట్రైక్ రేట్ వచ్చిందని, రాష్ట్రంలోని 28 జిల్లాలకు గాను 27 జిల్లాల్లో కూటమికే ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. అల్లూరి జిల్లా మినహా అన్ని జిల్లాల్లోనూ కూటమి హవా కొనసాగిందని, ఏడు జిల్లాల్లో వైసీపీ కనీసం ఒక్క జెడ్పీటీసీ స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయిందని, అలాగే ఎంపీటీసీ స్థానాల్లో 90 శాతానికి పైగా విజయాలు సాధించామని వెల్లడించారు.తుపాను సహాయక చర్యల విషయంలో ఎటువంటి భేషజాలకుపోకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర పొరుగు రాష్ట్రాల సహాయం కూడా తీసుకున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ కేడర్ బేస్డ్ పార్టీ అని, సేవా భావమే తమ రాజకీయ విధానమని ఆయన స్పష్టం చేశారు. నేరాలు, హింసలకు పాల్పడటమే రాజకీయాలు అనుకునే గొడ్డలి పార్టీ నాయకులు తమ తీరుపై పునరాలోచన చేసుకోవాలని హితవు పలికారు. డ్రామాలతో ప్రజాతీర్పును ఎప్పటికీ మార్చలేరని, రక్తతర్పణాలు, విధ్వంసాలను ప్రజలు పూర్తిగా తిరస్కరించారని, ఇంతకంటే కూటమి ప్రభుత్వానికి గర్వకారణం ఏముంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.


విజయసాయిరెడ్డి కొత్త పార్టీపై కీలక ప్రకటన

నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి :

రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నూతన రాజకీయ పార్టీని స్థాపించనున్న నేపథ్యంలో, ఆయన ప్రతినిధులు తాజాగా కీలక ప్రకటన విడుదల చేశారు. ఒక ఉన్నతమైన ఆశయంతో, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఈ కొత్త పార్టీ ఆవిర్భవించబోతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని యువతకు ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు, వారి ఆకాంక్షలకు అనుగుణంగా సరికొత్త రాజకీయ వేదికను నిర్మించేందుకు విజయసాయిరెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని ప్రతినిధులు వెల్లడించారు.

కుటుంబ పార్టీలకు ప్రత్యామ్నాయం

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పార్టీలకు బలమైన ప్రత్యామ్నాయం అత్యవసరమని విజయసాయిరెడ్డి ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సామాన్యులకు, సమర్థులైన వారికి పెద్దపీట వేసేలా పార్టీ నిర్మాణం ఉంటుందని తెలిపారు. విజయసాయిరెడ్డి స్థాపించబోయే ఈ నూతన పార్టీలో కుటుంబ పాలనకు ఏమాత్రం చోటు ఉండదని, కేవలం ప్రజా సేవ, నిబద్ధత కలిగిన వారికే ప్రాధాన్యత ఉంటుందని ప్రతినిధులు తేల్చిచెప్పారు.



పోలీస్ అధికారులకు దీపావళి శుభాకాంక్షలు

ఎస్ఐ లను సన్మానించిన ఎర్ర యాకన్న






బాలానగర్ నవంబర్ 09 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ (టిడబ్ల్యూజేఎఫ్) అధ్యక్షుడు ఎర్ర యాకన్న బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, సక్రంలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారులు, జర్నలిస్టుల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని, పరస్పర సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జడ్పీటీసీ సభ్యులకు డిక్లరేషన్ ఫారాలు అందజేత.

గోపు సత్యనారాయణ సమక్షంలో కార్యక్రమం.

నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం ప్రతినిధి :మచిలీపట్నం నార్త్ జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన లంకె ఉషారాణి, కోడూరు జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన బొలిశెట్టి అరుణశ్రీలకు కృష్ణా జిల్లా జడ్పీ సీఈఓ శ్రీహరి డిక్లరేషన్ ఫారాలను అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.ప్రజల ఆశీస్సులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో సాధించిన ఈ విజయాలు మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపిచంద్, లంకె శేషగిరి, లంకె హరి, బండే శ్రీను, కాగిత శ్రీరామ్, అమిరెడ్డి శివయ్య తదితరులు పాల్గొన్నారు.



భోగాది రమాదేవికి జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలి!

నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్



నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం, నవంబర్ 9:భారతీయ జనతా పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు, నిస్వార్థ ప్రజా సేవకు మరోపేరు భోగాది రమాదేవికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్ కోరారు. బీజేపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయులుగా కొనసాగుతున్న ప్రతిష్ఠాత్మక కుటుంబం నుంచి వచ్చిన ఆమె, గత నాలుగు దశాబ్దాలుగా పార్టీకి విశిష్ట సేవలు అందిస్తున్న నిబద్ధత కలిగిన ఆదర్శ నాయకురాలని కొనియాడారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తే కృష్ణా జిల్లాలో పార్టీ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయడంతో పాటు, ఆ పదవికే వన్నె తీసుకురాగల సమర్థురాలని పేర్కొన్నారు.జాతీయ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా ఆమె విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. నాగాయలంక మండలం గుల్లలమోదలో కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలో క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి భోగాది రమాదేవి చేసిన కృషి ఎనలేనిదని బడే ప్రభాకర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.నాగాయలంక జడ్పీటీసీ స్థానానికి భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేసిన భోగాది రమాదేవి అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో శనివారం మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈఓ,రిటర్నింగ్ అధికారి నుంచి జడ్పీటీసీగా ఎన్నికైనట్లు ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని ఆమె అందుకున్నారు.ఈ సందర్భంగా బడే ప్రభాకర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధతకు ప్రతీకగా నిలిచే భోగాది రమాదేవికి జడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకోసం జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నవంబరు 12, 13వ తేదీల్లో విశాఖ వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు

ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయెల్, దిగ్గజ కంపెనీల చైర్మన్‌లు, సీఈఓలు

నిర్భయవార్త ప్రతినిధి :అమరావతి, నవంబరు 09: నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ థీమ్‌తో విశాఖ వేదికగా ఈ నెల 12,13వ తేదీల్లో రెండు రోజుల పాటు 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగనుంది. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు నూతన దశాదిశ అందించేలా ఈ పెట్టుబడుల సదస్సు విశాఖలో ఆవిష్కృతం కానుంది. కేవలం పెట్టుబడుల ఆకర్షణకు మాత్రమే పరిమితం కాకుండా వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ వివిధ అంశాలపై మేథోమథనం నిర్వహించి ఆ ఫలితాలను ముందుకు తీసుకెళ్లేలా ఈ భాగస్వామ్య సదస్సులో చర్చలు జరుగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర హోం అమిత్ షా సహా కేంద్రమంత్రులు, అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఈ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కానున్నారు. దాదాపు 58 దేశాలకు చెందిన ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల్ని అనుసంధానించటమే లక్ష్యంగా ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా నిలిచేలా ఈ సదస్సులో చర్చలు, ఒప్పందాలు జరుగనున్నాయి. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, పరస్పర విశ్వాసం, నిపుణుల దార్శనిక ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ చర్చలు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో భారత ఆర్థిక భాగస్వామ్యానికి ప్రధాన వేదికగా ఈ సదస్సును 1995 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ పెట్టుబడుల సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 58 దేశాల ప్రాతినిధ్యం, 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు ఈ సమ్మిట్ కు హాజరు కానున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. విధ దేశాల రాయబారులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులతో పాటు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఏడీబీ, యునెప్ లాంటి సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఈ సదస్సులో భాగంగా 400 పైచిలుకు బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహించనున్నారు. దీంతో పాటు ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బీ టూ జీ సమావేశాలు కూడా జరుగనున్నాయి.

ఏపీ ఉమెన్ గ్రోత్ సమ్మిట్ 2026

పెట్టుబడుల సదస్సులో భాగంగా ఈ నెల 11 తేదీన పారిశ్రామిక ప్రతినిధుల మధ్య ముందస్తు సమావేశాలు జరుగనున్నాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి అధికారిక విందు ఇవ్వనున్నారు. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్ లో 12, 13 తేదీల్లో ప్రధాన సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్ 2026 నిర్వహిస్తారు. 12 తేదీ ఉదయం 9.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పీయూష్ గోయెల్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేష్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధి రాబర్టో తదితరులు సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించనున్నారు. ఇక నవంబర్ 13, సాయంత్రం 4 గంటలకు సదస్సు ముగింపు కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, వాల్యుచైన్, క్వాంటం టెక్నాలజీ, సెమీ కండక్టర్ సహా నూతన సాంకేతికతలు, అంతర్జాతీయ సహకారం, నైపుణ్యాలు, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం, ఆహార భద్రత, జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయి. గత పెట్టుబడుల సదస్సు సహా వివిధ సందర్భాల్లో ఒప్పందాలను పారిశ్రామిక ప్రాజెక్టులుగా మలిచేందుకు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మంత్రులు, అధికారుల కమిటీని నియమించింది. ఈ కమిటీ ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల గ్రౌండింగ్ ను పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే రూ.6 లక్షల కోట్ల విలువైన 272 ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రారంభం అయ్యాయి. మరో రూ.17 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం ఇచ్చింది. 2025-26లో దేశంలోనికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీ దక్కించుకుంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 6 సన్నాహక ప్రాంతీయ సదస్సుల ద్వారా 194 ఎంఓయూల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. తద్వారా 1.47 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.

విద్యార్థినుల భవిష్యత్తుకు భద్రత ఎంతో అవసరం

విద్యార్థినీ... జర భద్రం కార్యక్రమంలో రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య






నిర్భయవార్త విజయవాడ: నవంబర్ 8, 2026.:విద్యార్థినులు విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 'విద్యార్థినీ... జర భద్రం' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల భద్రత విషయంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉన్న ట్లే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాప్తాడు వంటి ఘటనలు సమాజానికి మాయని మచ్చలని, ఇటువంటి ఘటనలకు దారితీసే చెడు ప్రభావాల నుంచి విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, అవి జరగకుండా నివారించడమే సమాజం బాధ్యతని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం సమన్వయంతో కృషి చేసినప్పుడే మహిళలు, విద్యార్థినులపై జరిగే దాడులను అరికట్టగలమన్నారు.అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థినులపై అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి, చెడుల మధ్య తేడాను గుర్తిస్తూ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తం గా 'జర భద్రం' వంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని బోర్డు చైర్మన్‌ను కోరా రు.మైలవరం సర్కిల్ ఇ న్‌స్పెక్టర్ కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులతో నిర్భయంగా పంచుకోవాలని, వాట్సాప్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని సూచిం చారు. న్యాయవాది డి. సౌజన్య మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గృహహింస, బాల్యవి వాహాలు, కిడ్నాప్‌లు, అపరిచి తులతో పరిచయాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చా రు.సామాజికవేత్త గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ 'జర భద్రం' అంటే భయపెట్టడం కాదని, జా గ్రత్తగా ఉండాలనే అవగాహన కల్పి ంచడమేనని వివరించారు. తల్లిదం్ర డులను, విద్యాబుద్ధులు నేర్పే గురువు లను గౌరవిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగా ల ని విద్యార్థినులకు సూచిం చారు.ఈ కార్యక్రమంలో మైలవరం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఉయ్యూరు నరసింహారావు, డి.సి.ఓ. అంగడి మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ కె. బ్యూల, జి.కొండూరు ఎస్సై నతీష్, మహిళా ఎస్సై గిరిజా మణి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు ఆధునిక స్టాల్ ఇన్ మాల్

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:గ్రామీణ ప్రాంతాల్లోని చేనేత కళాకారులు, హస్తకళాకారులు ఎంతో నైపుణ్యంతో తయారుచేసే సంప్రదాయ ఉత్పత్తులకు ఆధునిక మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే స్టాల్ ఇన్ మాల్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాబార్డు ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సోమేందర్ సింగ్ అన్నారు.సోమవారం ఎంజీ రోడ్డులోని పీవీపీ స్క్వేర్ మాల్‌లో నాబార్డు ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ సోమేందర్ సింగ్.. నేస్తం ఫౌండేషన్ సీఈవో సురేష్ వేసం తదితరులతో కలిసి స్టాల్ ఇన్ మాల్ స్టాళ్లను ప్రారంభించారు. హస్తకళలు, చేనేత కళాకారులతో మాట్లాడి ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమేందర్ సింగ్ మాట్లాడుతూ కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులను నేరుగా పట్టణ ప్రాంతాల వినియోగదారులకు పరిచయం చేయడం ద్వారా వారికి మెరుగైన మార్కెట్‌ను అందించవచ్చన్నారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులు, సంప్రదాయ కళాఖండాలను ప్రజలు ఎక్కువగా సందర్శించే షాపింగ్ మాల్స్‌లో ప్రదర్శనకు ఉంచడం ద్వారా కళాకారులకు కొత్త మార్కెట్ అవకాశాలు లభిస్తాయని వివరించారు. గ్రామీణ కళాకారుల ఉత్పత్తులను పట్టణ వినియోగదారులకు చేరువ చేయడంతో పాటు, సంప్రదాయ కళలు, చేనేత వస్త్రాలు, హస్తకళల పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేసే అవకాశం కలగడం వల్ల కళాకారులకు వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులతో పాటు చేనేత, హస్తకళలను నాబార్డు అన్ని విధాలా ప్రోత్సహిస్తోందన్నారు. నేస్తం ఫౌండేషన్ సీఈవో సురేష్ వేసం మాట్లాడుతూ చేనేత రంగం, హస్తకళలు మన దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని, తరతరాలుగా కళాకారులు తమ నైపుణ్యంతో ఈ కళలను కాపాడుకుంటూ వస్తున్నారని పేర్కొన్నారు. స్టాల్ ఇన్ మాల్ స్టాళ్లు ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. సంప్రదాయ కళలను ప్రోత్సహించడం, కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయడం, వారి ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం వంటి లక్ష్యాల సాధనలో నాబార్డు ఇటువంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాబార్డు, నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా గ్రామీణ కళాకారులకు మార్కెటింగ్ పరంగా కొత్త అవకాశాలు లభించడంతో పాటు, స్థానిక ఉత్పత్తులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు ఇటువంటి స్టాళ్లను సందర్శించి చేనేత, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.




చిత్రసీమ

ఎమ్మీ వేదికపై విజయ్ సేతుపతి చరిత్ర

- 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల ప్రజెంటర్‌గా అవకాశం

ప్రముఖ తమిళ నటుడు విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనత సాధించనున్నారు. నవంబర్ 23న న్యూయార్క్‌లో జరిగే 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో ప్రజెంటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ గౌరవం పొందుతున్న తొలి భారతీయ నటుడిగా ఆయన నిలవనున్నారు. గతంలో 2016లో ప్రియాంక చోప్రా ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో ప్రజెంటర్‌గా వ్యవహరించారు. అయితే ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేదికపై ఈ అవకాశం దక్కించుకున్న తొలి భారతీయ నటుడిగా విజయ్ సేతుపతి చరిత్ర సృష్టించారు.భారతీయ ప్రతిభను అంతర్జాతీయ వేదికలకు తీసుకెళ్లడంలో నిర్మాత కవితా గుప్తా కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024లో కమెడియన్ వీర్ దాస్‌ను ఈ వేదికపై హోస్ట్‌గా పరిచయం చేయడంలోనూ ఆమె విశేష పాత్ర పోషించారు.





సంప్రదాయ అందంతో మెరిసిన అదితి శైలి

తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి అదితి మైకల్ మరోసారి వార్తల్లో నిలిచింది. పోష్ పోరిస్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. తర్వాత అర్జున్ రెడ్డి, అమీతుమీ, చీకటిలో వంటి సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటించి ప్రేక్షకులకు చేరువైంది. తాజాగా ఓ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో సందడి చేసింది.

చీరకట్టులో సంప్రదాయ అందం

ఈ వేడుకకు అదితి సంప్రదాయ చీరకట్టులో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటివరకు బోల్డ్ ఫొటోషూట్లతో అలరించిన ఆమె.. ఈసారి ట్రెడిషనల్ లుక్‌లో అభిమానులను మెప్పించింది.సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే అదితి.. తరచూ తన ఫొటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా చీరకట్టులో షేర్ చేసిన ఫొటోలు కూడా నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. కొత్త సినిమా ద్వారా మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

షాలినీ మేకోవర్‌కు ఫ్యాన్స్ ఫిదా

- బొద్దుగుమ్మ నుంచి స్టైల్ ఐకాన్‌గా షాలినీ
- గ్లామర్ డోస్ పెంచిన షాలినీ పాండే

అర్జున్ రెడ్డి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన షాలినీ పాండే ఇప్పుడు సరికొత్త లుక్‌తో ఆకట్టుకుంటోంది. ఒకప్పుడు బొద్దుగా కనిపించిన ఆమె.. ఇప్పుడు స్లిమ్ అవతారంలో మెరిసిపోతోంది. బాలీవుడ్ నటి కరీనా కపూర్ స్ఫూర్తితో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టిన షాలినీ.. తాజాగా షేర్ చేసిన డిజైనర్ డ్రెస్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోషూట్‌కు స్టైలిస్టులు గౌర్వి దేశాయ్, నూపుర్ అభయ్ పాధ్యే, హెయిర్ స్టైలిస్ట్ ప్రతీక్ష ముచండికర్, మేకప్ ఆర్టిస్ట్ సిమువా, ఫొటోగ్రాఫర్ ప్రిషా చందేల్ పనిచేశారు. ఫొటోలకు షాలినీ ఎమోజీలను మాత్రమే క్యాప్షన్‌గా జోడించింది.ఫొటోలు షేర్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ చిత్రాలు వైరల్ అయ్యాయి. అభిమానులు హార్ట్, ఫైర్ ఎమోజీలతో ప్రశంసలు కురిపిస్తుండగా, “దేఖో పాపా మైనే క్యా ఉగాయా హై.. గంజా పాపా గంజా” డైలాగ్‌ను గుర్తు చేస్తూ కామెంట్లు చేస్తున్నారు. ఈ తాజా ఫొటోషూట్‌తో షాలినీ పాండే మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.



పచ్చ చీరలో పరువాలు

సంప్రదాయ అందాలతో ఆకట్టుకుంటున్న రాశి సింగ్

టాలీవుడ్ హీరోయిన్ రాశి సింగ్ సోషల్ మీడియాలో మరోసారి సందడి చేస్తోంది. తన అందం, అభినయంతో ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. తాజాగా సంప్రదాయ వస్త్రధారణలో మెరిసింది. గ్రీన్ కలర్ శారీలో అందంగా ముస్తాబై దిగిన ఫొటోలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.తాజా ఫొటోల్లో రాశి సింగ్ గ్రీన్ కలర్ శారీలో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. సంప్రదాయ చీరకట్టులో తనదైన అందంతో ఫొటోలకు పోజులిచ్చింది. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో కనిపిస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. చీరకు తగినట్టుగా ఎంపిక చేసుకున్న ఆభరణాలు, చక్కటి మేకప్ ఆమె రూపానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రాశి సింగ్ తరచూ తన వ్యక్తిగత, సినీ విశేషాలతో పాటు ఫొటోషూట్లను కూడా అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా షేర్ చేసిన గ్రీన్ శారీ ఫొటోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సంప్రదాయ దుస్తుల్లోనూ తన గ్లామర్‌ను చాటుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది.సినిమాలతో బిజీగా ఉంటూనే సోషల్ మీడియా ద్వారా అభిమానులకు చేరువగా ఉంటున్న రాశి సింగ్.. తన తాజా ఫొటోషూట్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. ఆమె కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

భాగ్యశ్రీ బోర్సే

గ్లామర్ సందడి

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు

టాలీవుడ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాలో ఆకట్టుకుంది. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో దిగిన స్టైలిష్ ఫొటోలను అభిమానులతో పంచుకోగా, అవి నెట్టింట వైరల్‌గా మారాయి. నల్లటి దుస్తుల్లో మోడ్రన్ లుక్‌తో మెరిసిన ఆమె.. తన ఫ్యాషన్ సెన్స్, మేకప్, హెయిర్ స్టైల్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి ఫొటోలోనూ తనదైన స్టైల్‌తో అభిమానులను ఆకట్టుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే భాగ్యశ్రీ.. తరచూ ఫొటో షూట్లు, సినిమా విశేషాలను పంచుకుంటూ అభిమానులకు చేరువవుతోంది. తాజాగా షేర్ చేసిన ఈ బ్లాక్ డ్రెస్ ఫొటోలకు నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197